జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 26-2-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 603 పేజీలు: 4 వెల : రూ.7

# డయేరియా.. తగ్గుముఖం

* ఇప్పటి వరకు 102 డయేరియా కేసులు గుర్తింపు
* పలు ఆసుపత్రుల్లో చికిత్స
* ఇంటింటా సచివాలయ సిబ్బంది సర్వే
* పరామర్శిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు
* డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచిత వైద్యం
* డయేరియాకు కారణం... నీరు, ఆహారం: మంత్రి నారాయణ
* అవాస్తవాలు నమ్మవద్దు: కలెక్టర్
* వాస్తవాలను ప్రభుత్వం దాస్తోంది:ధర్మాన
* మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు పరిహారం ఇవ్వాలి: సీదిరి



శ్రీకాకుళం, ఫిబ్రవరి 25(వార్త): శ్రీకాకుళం నగరంలో డయేరియా అదుపులోకి వచ్చింది. ఇప్పటి వరకూ 102 మంది అతిసారంతో బాధపడుతున్నట్టు వైద్యఆరోగ్యశాఖ గుర్తించింది. బుధవారం ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది డయేరియా ప్రబలిన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేవారు. డయేరియాతో బాధపడుతున్న వారు రిమ్స్, జెమ్స్, కిమ్స్, తదితర ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. డయేరియా ప్రబలిన ప్రాంతాల్లో కుళాయిల ద్వారా నీటిసరఫరా నిలిపివేశారు. ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందిస్తున్నారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు. డయేరియా లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి రావాలని ప్రజలకు వివరిస్తున్నారు. కలెక్టర్, డీఎంహెచ్‌వో ఆయా ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ డయేరియా ప్రబలిన ప్రాంతాలతో పాటు పలు ఆసుపత్రులను సందర్శించారు. డయేరియాతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. వైద్యులతో మాట్లాడారు. ఇప్పటి వరకు 102 కేసులు గుర్తించినట్లు ఆయన మీడియాకు వివరించారు. ఇందులో 13 కేసులు డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. మిగిలిన కేసుల్లో రెండు కేసులకు డయాలసిస్ అవుతుందని, మిగిలిన కేసులు ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. ఈ కేసులు నాలుగున్నర సచివాలయాల పరిధిలో గుర్తించినట్లు వివరించారు. ఇందులో ఒక సచివాలయం పరిధిలో 50 శాతం, మూడున్నర సచివాలయాల పరిధిలో 50 డయేరియా కేసులు గుర్తించినట్లు చెప్పారు. దమ్మలవీధి, మంగువారితోట, గుడివీధి, కాకి వీధుల్లో డయేరియా కేసులు గుర్తించినట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ 50 టీములు పెట్టి డోర్ టు డోర్ వైద్య సిబ్బందిని పంపించి ఏ ఇంటిలోనైనా వ్యాధి లక్షణాలు ఉంటే వారిని హాస్పిటల్స్‌కి పంపించే ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డయేరియాకి కారణం నీరు, ఆహారమన్నారు. నీటి పరీక్షలు పూర్తి అయి ప్రిలిమినరీ టెస్ట్‌లో ఏమీ లేదని, కానీ దాని కల్చర్ టెస్టులో క్లారిటీ వస్తుందని వివరించారు. కల్చర్ రిపోర్ట్ వచ్చిన తరువాత తగు చర్యలు తీసుకుంటారన్నారు. డయేరియా మరణం ఒకటే ఉందని, ఇంటి వద్ద ఎవరైతే మృతి చెందారో దానిపై అనుమానం వచ్చి పోస్టుమార్టంకి ఇచ్చినట్లు స్పష్టం చేశారు. శ్రీకాకుళం మున్సిపాలిటీకి 10 కోట్ల రూపాయలు కాలువలకు కేటాయించినట్లు వెల్లడించారు. తక్షణమే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. తాగునీరు స్టోరేజ్ కు శ్రీకాకుళం మున్సిపాలిటీకి 60 కోట్లుకి టెండర్లు పిలవడమైనదని, అవి కూడా వచ్చే నెల పనులు ప్రారంభమవుతాయన్నారు. నగరంలో అతిసార వ్యాప్తికి కారణమైన పాత తాగునీటి పైపులైన్లు, అస్తవ్యస్తమైన డ్రైనేజీ వ్యవస్థలను యుద్ధప్రాతిపదికన ప్రక్షాళన చేస్తామని మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. శ్రీకాకుళం నగరంలో డ్రైనేజీల పునరుద్ధరణ, మరమ్మతుల కోసం తక్షణమే రూ. 12 కోట్లు విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో రూ. 2 కోట్లను అతిసార ప్రభావిత ప్రాంతాల్లోని కచ్చా డ్రైన్ల పనుల కోసం కేటాయించాలని అధికారులను ఆదేశించారు. నగరవ్యాప్తంగా ఇంటింటికీ సురక్షిత మంచినీటిని అందించేందుకు రూ. 60 కోట్లతో చేపట్టే పనులను మార్చి నెలలో మొదలు పెడతామని స్పష్టం చేశారు. నిలిచిపోయిన సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనుల కోసం రూ. 23 కోట్లు, అమృత్-1 పథకం కింద డ్రైనేజీల నెట్వర్క్ కోసం రూ. 35 కోట్లు వెచ్చిస్తున్నట్లు మంత్రి తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ మాట్లాడుతూ.. అక్రమ మోటార్ కనెక్షన్లు, కలుషిత నీటికి కారణమవుతున్న పాత పైపులైన్ల తొలగింపునకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్ కుమార్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ కమిషనర్ సస్పెండ్

నగరంలో డయేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారన్న కారణంతో కమిషనర్ హెచ్.కూర్మారావును సస్పెన్షన్ చేస్తూ పురపాలిక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆయన స్థానంలో శ్రీకాకుళం కార్పొరేషన్ ఇన్‌చార్జిగా విశాఖపట్నం కమిషనర్ వి.రవీంద్రను నియమించింది. సస్పెన్సన్ కాలంలో ఆయన ముందస్తు అనుమతి లేకుండా శ్రీకాకుళం హెడ్ క్వార్టర్స్ విడిచి వెళ్లకూడదని ఆదేశించింది. కూర్మారావు బాధ్యతలు చేపట్టిన రెండు వారాలకే సస్పెన్సన్‌కు గురి కావడం గమనార్హం.

## మరణాలను ప్రభుత్వం దాస్తోంది:ధర్మాన




శ్రీకాకుళం నగరంలోని డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో వైసీపీ నేతలు పర్యటించారు. దమ్మల వీధిలో మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్, సీదిరి అప్పలరాజులు డయేరియా బాధితుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్యంపై ఆరా తీశారు. మెరుగైన ఆరోగ్యం అందేలా చూస్తామని, ఆందోళన వద్దని వారు బాధితులకు తెలిపారు. అనంతరం ధర్మాన ప్రసాదరావు మీడియాతో మాట్లాడుతూ డయేరియా మరణాలను దాచాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ప్రజారోగ్యం కూటమి ప్రభుత్వానికి ప్రాధాన్యత కాదా? అని ప్రశ్నించారు. ప్రజలకు సురక్షిత నీటిని ఇవ్వలేకపోయారని మండిపడ్డారు. మున్సిపల్ కార్యాలయాన్ని ప్రైవేటు కార్యాలయంగా మార్చేశారన్నారు. మంచి ప్రభుత్వం అని స్టిక్కర్ డోర్‌కు అంటించడం కాదు ప్రజల హృదయాల్లో ఉండాలని ఎద్దేవా చేశారు. డయేరియాతో నలుగురు చనిపోతే.. ఒక్కరే చనిపోయారని అధికారులతో చెప్పిస్తున్నారన్నారు. మాజీ మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ శ్రీకాకుళంలో డయేరియా ప్రబలడానికి ప్రభుత్వ వైఫల్యమే కారణమన్నారు. మున్సిపల్ వాటర్.. నీరా? విషమా? అని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. ప్రజల ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి. ఓట్లు వేసిన పాపానికి ప్రజలకు మంచి నీళ్లు కూడా ఇవ్వని దుస్థితి ఏర్పడిందన్నారు. ఇవి డయేరియా మరణాలు కాదు.. ప్రభుత్వం హత్యలుగా గుర్తించాలన్నారు. మృతుని కుటుంబ సభ్యులకి 25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## మందసలో ఎర్రన్నాయుడు విగ్రహం ఏర్పాటు



**మందస, ఫిబ్రవరి 25(వార్త):** కేంద్ర మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర లెజెండ్ స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు విగ్రహాన్ని మందస పట్టణంలోని ఏర్పాటు చేయడానికి తెలుగుదేశం పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకై వారంతా వడివడిగా అడుగులు వేస్తున్నారు. మందస పట్టణంలోని మార్కెట్ రోడ్డు జంక్షన్ లో సుమారు 8 నుంచి 9 అడుగుల నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి సన్నహాలు చేస్తున్నారు. ఇప్పటికే విగ్రహం నమూనాను కోనసీమ ప్రాంతానికి చెందిన ఓ నిపుణుడైన కళాకారుడికి అప్పగించినట్లు సమాచారం. పార్టీ నాయకులు ఏకత్రాటిపై ఇప్పటికే వచ్చి, సొంత విరాళాలతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. సుమారు మూడు నెలల్లో పనులు పూర్తి చేసి, విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని పార్టీ నాయకులు చెప్పారు. ఇందుకై దాదాపు రూ.4లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వ్యయం కానుందని వారు తెలిపారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు, సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాలు మందసలో బస్టాండ్లో ఉండగా... ఎర్రన్నాయుడి విగ్రహం ఏర్పాటుతో తెలుగుదేశం పార్టీ నాయకుల విగ్రహాలు మందసలో పరిపూర్ణత లభించబోనుందని వారు పేర్కొంటున్నారు. కాగా, వీలైనంత తొందరలో విగ్రహన్ని ఏర్పాటు చేస్తామని వారు చెప్పారు.

## జనసేన 'ఉద్యమి' సభ్యత్వ నమోదు

### -గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కీలకం
### -విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన జిల్లా కార్యదర్శి మజ్జి భాస్కరరావు
### -పార్లమెంటరీ సమన్వయకర్త కొరికానతో చర్చలు



**మందస, ఫిబ్రవరి 25(వార్త):** జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 26 నుంచి ప్రారంభమవుతున్న 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి ఒక మహత్తర అవకాశంగా నిలవనుందని, ఉద్యమిని విజయవంతం చేయాలని శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి మజ్జి భాస్కరరావు పిలుపునిచ్చారు. మందస మండలంలోని హరిపురంలో భాస్కరరావు విలేకరులతో మాట్లాడుతూ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆలోచనతో ప్రారంభమైన ఈ కార్యక్రమం, కేవలం సభ్యత్వ నమోదు కార్యక్రమం మాత్రమే కాకుండా, భవిష్యత్ స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేసే దిశగా రూపుదిద్దుకుంటోందన్నారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లో సమర్థవంతంగా పోటీ చేయాలంటే గ్రామస్థాయిలో బలమైన నాయకత్వం, శక్తివంతమైన కార్యకర్తల బృందం, స్పష్టమైన సంస్థాగత నిర్మాణం అవసరమన్నారు. ఈ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రతీ గ్రామంలో జనసైనికులు, వీర మహిళలు పెద్ద ఎత్తున ఉద్యమి సభ్యత్వం నమోదు చేసుకోవడం ద్వారా పార్టీకి బలమైన పునాది ఏర్పడుతుందన్నారు. ఉద్యమి సభ్యత్వం కలిగిన వారికే పార్టీ కమిటీల్లో బాధ్యతలు అప్పగించబడతాయని, గ్రామ, మండల, జిల్లాస్థాయిల్లో నాయకత్వ బాధ్యతలు చేపట్టేందుకు సభ్యత్వం తప్పనిసరి అన్నారు. దీంతో గ్రామ స్థాయిలో సమర్థులైన, నిబద్ధత కలిగిన నాయకులు ముందుకు వచ్చే అవకాశముంటుందన్నారు. నాయకత్వ శిక్షణ కార్యక్రమాల ద్వారా వారిని ప్రజాసేవకు సిద్ధం చేసి, పంచాయతీ ఎన్నికల్లో పార్టీ తరఫున సమర్థ అభ్యర్థులుగా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని చెప్పారు. అదనంగా ఉద్యమి సభ్యత్వం ద్వారా రూ.5లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పించడం ద్వారా జనసైనికుల కుటుంబాలకు రక్షణ కల్పించబడుతుందని, ఇది పార్టీ తన కార్యకర్తల పట్ల చూపుతున్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. గ్రామ స్థాయిలో సభ్యత్వ నమోదు పెరిగితే, ప్రతీ గ్రామంలో బూత్ స్థాయి నిర్మాణం బలపడుతుందన్నారు. ప్రజా సమస్యలపై తక్షణ స్పందన, సేవా కార్యక్రమాల నిర్వహణ, ఎన్నికల సమయంలో సమగ్ర వ్యూహాలతో ముందుకు సాగేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పంచాయతీ ఎన్నికల్లో విజయానికి ఇది బలమైన పునాది అవుతుందన్నారు. పలాస నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో జనసైనికులు, వీరమహిళలు ముందుకు వచ్చి ఉద్యమి సభ్యత్వం నమోదు చేసుకుని పార్టీ బలోపేతానికి సహకరించాలని నాయకులు పిలుపునిచ్చారు. పలాస నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో జనసైనికులు, వీరమహిళలు ముందుకు వచ్చి ఉద్యమి సభ్యత్వం నమోదు చేసుకుని పార్టీ బలోపేతానికి సహకరించాలని భాస్కరరావు పిలుపునిచ్చారు.

# 1000కు పైగా ఆధునిక గొడౌన్లు

### -రైతు నిల్వ సామర్థ్యాల్లో చారిత్రాత్మక ముందడుగు.
### - రూ.504 కోట్ల భారీ పెట్టుబడి
### -గ్రామీణ వ్యవసాయ రంగానికి నూతన శకం
### -ఆధునిక మల్టీపర్పస్ సౌకర్య కేంద్రాలుగా పీఏసీఎస్‌లు
### -తక్కువ వడ్డీకి రుణాలు -పూర్తి ప్రభుత్వ హామీతో రైతు సంఘాలకు భరోసా
### - డ్రైయింగ్ యార్డులు, ఆధునిక డ్రైయర్లపై ప్రభుత్వ దృష్టి
### -అకాల వర్షాలతో ఇబ్బందులకు అడ్డుకట్ట
### -ఆర్ఎస్‌కేలద్వారా టార్పాలిన్ల పంపిణీ - ఎలక్ట్రానిక్ డ్రైయర్లపై పైలట్ ప్రాజెక్టులు -సాంకేతిక వ్యవసాయానికి శ్రీకారం
### -మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 25(వార్త):** అమరావతి, ఫిబ్రవరి 25: శాసన మండలిలో వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి కింద ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను బహుళార్థ సాధక సౌకర్య కేంద్రాలుగా అభివృద్ధి చేసే కార్యక్రమంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి అచ్చెన్నాయుడు సమగ్రంగా సమాధానం ఇచ్చారు. జూన్ 2020లో కేంద్ర ప్రభుత్వ ఏఐఎఫ్ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని, రైతు భరోసా కేంద్రం స్థాయిలో నిల్వ, ఆరబెట్టే మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. విశాఖ జిల్లా మినహా రాష్ట్రవ్యాప్తంగా గొడౌన్లు, డ్రైయింగ్ యార్డుల నిర్మాణం జరుగుతోందని, మొత్తం రూ.504.42 కోట్ల వ్యయంతో ఈ పథకం అమలవుతోందని పేర్కొన్నారు. నాబార్డ్ ద్వారా రీఫైనాన్స్ సదుపాయం కల్పించబడుతుందని, పీఏసీఎస్‌లకు 4% వడ్డీపై 3% వడ్డీ రాయితీ లభిస్తుందని, 90% రుణం మరియు 10% మార్జిన్ మనీ విధానంలో ప్రాజెక్టులు అమలవుతున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మార్జిన్ మనీ కింద రూ.50.4 కోట్లు మంజూరు చేసి అందులో రూ.20 కోట్లు ఇప్పటికే విడుదల చేసిందని, 33 సంవత్సరాల పాటు ఏడాదికి రూ.1 నామమాత్రపు అద్దెకు ప్రభుత్వ భూమి లీజుకు ఇస్తున్నట్లు, రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంపు డ్యూటీ మినహాయింపు కల్పించినట్లు చెప్పారు. ఈ పథకం కింద రుణాలకు ప్రభుత్వ హామీ ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటివరకు 1005 ఎంపీఎఫ్‌సీ గొడౌన్ల పనులు ప్రారంభమై, 717 గొడౌన్లు, అనుబంధ డ్రైయింగ్ యార్డులు పూర్తయ్యాయని, 572 పీఏసీఎస్‌ల్లో 1111 సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి తేమ మీటర్లు, తూనిక బ్యాలెన్స్‌లు, డెస్క్‌టాప్‌లు సరఫరా చేసినట్లు తెలిపారు. 232 పీఏసీఎస్‌ల్లోని 462 అసేయింగ్ కేంద్రాలకు అవసరమైన ల్యాబ్ పరికరాలు అందించామని చెప్పారు. మొత్తం రూ.381.72 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని, అందులో గొడౌన్ల నిర్మాణానికి రూ.373.97 కోట్లు, పరికరాల సరఫరాకు రూ.7.75 కోట్లు ఖర్చయ్యాయని వెల్లడించారు. ఈ చర్యల ద్వారా రైతులకు శాస్త్రీయ నిల్వ సదుపాయాలు కల్పించి, పంటలకు మెరుగైన ధరలు సాధించే అవకాశాలు పెరుగుతున్నాయని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఈ పథకం కీలకంగా నిలుస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు మండలికి తెలియజేశారు.

### రైతు ఆదాయం పెంపే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

ఆకాల వర్షాల కారణంగా పంట చేతికి వచ్చే సమయంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం గుర్తించిందని, 2014-19 తెలుగుదేశం ప్రభుత్వ కాలంలో టార్పాలిన్లు పంపిణీ చేశామని, ఆ తరువాత పంపిణీ నిలిచిపోయిందని తెలిపారు. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో టార్పాలిన్లు కొనుగోలు చేసి ప్రతి రైతు సేవా కేంద్రంలో బల్క్‌గా నిల్వ ఉంచామని, ఇంతకుముందు వ్యక్తిగతంగా పంపిణీ చేసేవారమని, ఇప్పుడు అవసరమైన రైతులు ఆర్ఎస్‌కేల ద్వారా తీసుకుని అవసరం తీరిన తరువాత తిరిగి ఇచ్చే విధానాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. వ్యవసాయ రంగంలో సాంకేతికత విస్తృతంగా అభివృద్ధి చెందిందని, ఆధునిక ఎలక్ట్రానిక్ డ్రయర్లు మార్కెట్లో అందుబాటులో ఉన్నప్పటికీ అవి అధిక వ్యయంతో ఉన్నాయని తెలిపారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తో చర్చించి రాష్ట్రంలోని ప్రతి ప్రాంతంలో ఒకటి లేదా రెండు చోట్ల నమూనా ప్రాతిపదికన ఎలక్ట్రానిక్ డ్రయర్లు ఏర్పాటు చేసి, ఫలితాలు అనుకూలంగా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. తడి ధాన్యాన్ని శాస్త్రీయంగా ఎండబెట్టి రైతులకు మెరుగైన ధర లభించేలా చేయడం ప్రభుత్వ లక్ష్యమని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆధునిక డ్రయింగ్ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## 13 పశువులతో వాహనాల స్వాధీనం





**మందస, ఫిబ్రవరి 25(వార్త):** అక్రమంగా పశువులు తరలిస్తున్న రెండు వాహనాలను మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇచ్చాపురం నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న వీటిని పట్టుకున్నారు. ఓ వాహనంలో 7పశువులు, మరో వాహనంలో ఆరు పశువులను రెండు వాహనాలలో తరలిస్తుండగా, మందస మండలంలోని బాలిగాం గ్రామం సమీపంలోని జాతీయ రహదారిపై మందస ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్ పట్టుకున్నారు. వాహనాలు, సిబ్బందిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు. పశువులను సంరక్షణ నిమిత్తం గోశాలకు తరలించామని తెలిపారు.

## మురికికూపంలా మారిన కొత్త కర్రచెరువు

### - డ్రైనేజీ నీటితో నిండిన చెరువు...
### -దోమలు, దుర్గంధంతో ప్రజల ఇబ్బందులు

**నరసన్నపేట, ఫిబ్రవరి 25(వార్త):** నరసన్నపేట పట్టణంలోని కొత్త కర్రచెరువు మురికికూపంలా మారి స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ఇందిరానగర్, హట్కో కాలనీ, వంశధార కాలనీ, గాంధీనగర్ ప్రాంతాల నుంచి డ్రైనేజీ నీరు చెరువులో చేరుతోందని స్థానికులు తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులు పగిలిపోవడం వల్ల మురుగునీరు నేరుగా చెరువులోకి చేరుతున్నదని పేర్కొన్నారు. చెరువులో నిల్వైన మురుగునీరు బయటకు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో పరిస్థితి మరింత విషమంగా మారింది. దీంతో గాంధీనగర్, ప్రశాంతి నగర్ ప్రాంతాల్లో దోమల విస్తరణ పెరిగి దుర్గంధం వ్యాపిస్తున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చెరువును శుభ్రపరచి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# అసెంబ్లీ అబద్ధాల వేదిక

### - ప్రజారోగ్యం గాలికొదిలేసిన ప్రభుత్వం
### -మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ధ్వజం



**కొత్తూరు, ఫిబ్రవరి 25 (వార్త):** చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పవిత్రమైన అసెంబ్లీని అబద్ధాల ప్రచారానికి వేదికగా మార్చుకుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్రస్థాయిలో విమర్శించారు. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి అంటే ఏమాత్రం భయం, భక్తి లేకుండా కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడిని వాడుకోవడం దారుణమని ఆమె మండిపడ్డారు. తిరుమల లడ్డూ నెయ్యి అంశంపై అసెంబ్లీలో ప్రభుత్వం చేసిన చర్చంతా కేవలం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై రాజకీయంగా బురద చల్లడానికేనని, ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇటువంటి అసత్య ప్రచారాలకు తెరలేపారని ఆమె విమర్శించారు. దేవుడిని సైతం రాజకీయాల కోసం వాడుకోవడం చంద్రబాబు నైజమని ఆమె ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రజారోగ్యం గాలికొదిలేసిన పరిస్థితి కనిపిస్తోందని రెడ్డి శాంతి ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో కలుషిత నీటి కారణంగా డయేరియా (అతిసారం) ప్రబలి సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోతుంటే, ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం అత్యంత దారుణమన్నారు. ఈ మరణాలు ప్రకృతి వైపరీత్యం వల్ల సంభవించినవి కావని, ఇవి ముమ్మాటికీ ప్రభుత్వ పాలనా వైఫల్యమేనని ఆమె స్పష్టం చేశారు. పారిశుధ్య నిర్వహణ లోపం, తాగునీటి క్లోరినేషన్ చేయకపోవడమే ఈ దుస్థితికి కారణమని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస మందులు మరియు సిబ్బంది లేకపోవడంతో పేదలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి అప్పులపాలవుతున్నారని ఆమె ఆరోపించారు. గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఆరోగ్య రంగం స్వర్ణయుగాన్ని చూసిందని ఆమె గుర్తు చేశారు. క్లిష్టమైన చికిత్సలను 3,000 పైచిలుకు పెంచి సామాన్యుడికి కార్పొరేట్ వైద్యాన్ని చేరువ చేశారని, గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం ఇంటి ముంగిటకే వచ్చేలా వినూత్న వ్యవస్థను నిర్మించారని కొనియాడారు. ఇంటింటికీ సర్వే చేసి రోగ నిర్ధారణ చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసిన ఘనత జగన్ కే దక్కుతుందని ఆమె పేర్కొన్నారు. కానీ నేడు కూటమి ప్రభుత్వంలో కనీస వైద్య సేవలు కూడా సామాన్యులకు అందని ఆకాశంలా మారాయని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం తన రాజకీయ కక్షసాధింపు చర్యలు మానుకొని, ప్రజారోగ్యంపై దృష్టి సారించాలని మరియు బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని రెడ్డి శాంతి డిమాండ్ చేశారు.

# తండ్యాలవాని పేటకు తాగునీరు



### - రూ.2 లక్షలతో బోరు నిర్మాణం
### -రక్షిత మంచినీటి సరఫరా ప్రారంభం

**నరసన్నపేట, ఫిబ్రవరి 25(వార్త):** నరసన్నపేట మండలం తండ్యాలవాని పేట గ్రామానికి ఎట్టకేలకు తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. మండల పరిషత్ నిధుల నుంచి రూ.2 లక్షలు మంజూరు చేసినట్లు ఎంపీపీ ఆరంగి మురళీధర్ తెలిపారు. ఈ నిధులతో బొడ్డవాని పేట వద్ద బోరు నిర్మాణం చేసి, విద్యుత్ సౌకర్యం కల్పిస్తూ రక్షిత మంచినీటి పథకానికి తాగునీరు అందిస్తున్నామని చెప్పారు. బుధవారం ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ అల్లు అసిరి నాయుడు ఆధ్వర్యంలో ప్రారంభించినట్లు వెల్లడించారు. గ్రామస్థుల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకడం ఆనందదాయకమని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## అపురూపం.. వల్లభుని ఆలయం

**మందస, ఫిబ్రవరి 25(వార్త):** డోలోత్సవాలకు వల్లభనారాయణుడు సిద్ధమయ్యాడు.. భక్తులకు కొంగుబంగారంగా పేరొందిన స్వామివారి ఆలయాన్ని ఎంతో అందంగా అలంకరించారు. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన రట్టి గ్రామంలో వెలసిన శ్రీవల్లభనారాయణస్వామి డోలోత్సవాలు 26 నుంచి ప్రారంభం కానున్నాయి. ఆరు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు భారీ ఎత్తున భక్తులు వస్తారు. ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు కూడా నడుపుతారు. డోలోత్సవాలకు స్వామి ఆలయం విద్యుత్ అలంకరణతో కనువిందు చేస్తోంది. గ్రామస్తులు ఐక్యంగా స్వామి ఉత్సవాలను జరుపుతారు. దేవాదాయశాఖాధికారులు కూడా డోలోత్సవాలను విజయవంతంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేశారు.



## నిరుపేదల సేవల్లో సత్యసాయి భక్తులు




**కవిటి, ఫిబ్రవరి 25(వార్త):** రాజపురం గ్రామానికి చెందిన సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతినెలా కొన్ని నిరుపేద కుటుంబాలకు అందజేస్తున్న నిత్యావసర సరకుల సేవా కార్యక్రమంలో భాగంగా ఈ నెలలో నాలుగు కుటుంబాలకు సహాయం అందజేశారు. ఒక్కొక్కరికి నెలకు సరిపడా నిత్యావసర సరకులను కోటిలింగి గ్రామంలో పెద్దపాటి వీరమ్మ, నల్ల లక్ష్మి, ఆర్ తొత్తిడి పుట్టుగ లో కలియా భాను, చిన్న ఎర్ర గోవింద పుట్టుగలో నంద రఘు లకు అందజేశారు. సత్యసాయి సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు చాలా సంతోషం వ్యక్తం చేస్తూ సేవా సమితి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## పోలాకిలో వృద్ధురాలి ఆత్మహత్య

**పోలాకి, ఫిబ్రవరి 25(వార్త):** పోలాకి మండల కేంద్రానికి చెందిన కరణం చిన్నమ్మడు (70) అనారోగ్య కారణాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ రంజిత్ వెల్లడించిన వివరాల ప్రకారం, అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఈ నెల 22న వాస్మాల్ ద్రావణం తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న వృద్ధురాలిని కుటుంబ సభ్యులు రిమ్స్ ఆసుపత్రి శ్రీకాకుళం కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

## జలుమూరు కేజీబీవీలో సీసీ కెమెరాలు



**జలుమూరు, ఫిబ్రవరి 25(వార్త):** విద్యాశాఖ ఆదేశాల మేరకు జలుమూరు మండలం కేజీబీవీ పాఠశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ యశోద తెలిపారు. బుధవారం పాఠశాల ప్రాంగణంలోని వివిధ ప్రాంతాల్లో మొత్తం 9 సీసీ కెమెరాలు అమర్చినట్లు ఆమె వివరించారు. ఇటీవల కాలంలో విద్యార్థినులకు కలుగుతున్న పలు ఇబ్బందులను నివారించేందుకు, భద్రతను మరింత బలోపేతం చేయడానికి ఈ చర్యలు ఉపయుక్తంగా ఉంటాయని చెప్పారు. క్యాంపస్‌లో క్రమశిక్షణ, భద్రత, పర్యవేక్షణ మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రిన్సిపల్ తెలిపారు.

## ఉపాధి నిధులతో బీటీ రోడ్డు పూర్తి

### - బాడాం నుంచి తెలగవలస వరకు
### రూ.50 లక్షలతో అభివృద్ధి

**నరసన్నపేట, ఫిబ్రవరి 25(వార్త):** బాడాం పంచాయతీలో బీటీ రోడ్డు నిర్మాణాలు పూర్తి చేసినట్లు పంచాయతీరాజ్ శాఖ మండల ఇంజినీర్ బగ్గు నర్సింగరావు తెలిపారు. బుధవారం ఆయన వివరాలను వెల్లడిస్తూ బాడాం గ్రామం నుంచి తెలగవలస వరకు రూ.50 లక్షల ఉపాధి హామీ నిధులతో రహదారి నిర్మాణం పూర్తి చేశామని చెప్పారు. సుమారు ఒక కిలోమీటర్ మేర ఈ పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కృషితో ఈ రహదారి అభివృద్ధి సాధ్యమైందని ఆయన తెలిపారు. ఈ రహదారి ద్వారా గ్రామాల మధ్య రాకపోకలు సులభతరమవుతాయని, ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు..



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## -ఈఎస్ఐసీ వ్యవస్థాపక దినోత్సవంలో పెన్షన్ పంపిణీ

**నరసన్నపేట, ఫిబ్రవరి 25(వార్త):** ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా భీమా చేసుకోవాలని ఉద్యోగుల రాష్ట్ర బీమా సంస్థ (జు×జ) శ్రీకాకుళం బ్రాంచ్ మేనేజర్ ప్రజ్ఞ సూచించారు.

## కుటుంబసభ్యులకు కొండంత అండ

మంగళవారం సాయంత్రం నరసన్నపేట మండలం మడపాం గ్రామంలో ఈఎస్ఐసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా భీమా ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. గ్రామంలోని పేపర్ మిల్లులో పనిచేసిన వాసుదేవరావు కుటుంబానికి నెలవారీ రూ.10,000 పెన్షన్‌ను ఆమె అందజేశారు. భీమా ద్వారా కుటుంబ సభ్యులకు ఆర్థిక భద్రత కలుగుతుందని తెలిపారు. ఉద్యోగులు ఈఎస్ఐసీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# ఆ కుటుంబానికి అండగా రాము

**- దుబాయ్‌లో మరణించిన దేవునల్తాడ వాసి మోహనరావు**

**- అన్నీ తానై నిలిచి చివరి చూపును చేరువ చేసిన రామ్మోహన్‌నాయుడు**

**- దేవునల్తాడలో అంత్యక్రియలు**


**వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 25(వార్త):** పొట్టకూటి కోసం దుబాయ్ వలసపోయాడు.. అనారోగ్య కారణాలతో తనువు చాలించాడు.. రెక్కాడితే కాని.. డొక్కాడని ఆ కుటుంబం.. పెద్ద దిక్కు మరణంతో ఏమి తోచని సమయం.. కడ చూపు కూడా కరువవుతుంది అన్న భయం.. అలాంటి సమయంలో సమస్య కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చెంతకు చేరడం.. ఆ కుటుంబానికి అన్నీ తానై నిలిచి భరోసా కల్పించారు. దుబాయ్ నుండి మృతదేహాన్ని తెప్పించి చివరి చూపును సైతం చేరువ చేశారు.

వజ్రపుకొత్తూరు మండలం దేవునల్తాడ గ్రామానికి చెందిన బుడగట్ల మోహనరావు (42) రిగ్గర్ గా దుబాయ్ లో పనిచేస్తూ ఉన్నాడు. ఫిబ్రవరి తొమ్మిదవ తేదిన సహచరులు పనికి రమ్మంటే ఒంట్లో నలతగా ఉందని రూమ్ లోనే ఉండిపోయాడు.. తీరా వారు వచ్చి చూసేసరికి విగతజీవిగా పడి ఉన్నాడు. ఆ బాధలోనే దేవునల్తాడలో ఉన్న భార్య కుమారులు ధనలక్ష్మి, రాజేష్, నితిన్ లకు సమాచారం ఇచ్చారు. సమాచారాన్ని అయితే చేరవేశారు కానీ చివరి చూపు ఎలా అందివాల్లో అక్కడివారికి తెలియరాలేదు. తోడ్పాటు అందించాల్సిన కంపెని సైతం చేతులు ఎత్తెయ్యడంతో మోహనరావు కడచూపు తమకు దక్కదుఏమో అని ఆందోళన చెందారు. ఇదే సమయంలో గ్రామానికి చెందిన టిడిపి నేత అప్పోజి సహకారంతో సమాచారాన్ని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చెంతకు చేరవేశారు. గత సోమవారం దీనిపై సమాచారం అందుకున్న రామ్మోహన్ నాయుడు కుటుంబానికి ధైర్యాన్ని ఇస్తూ.. భాద్యతను తీసుకున్నారు. భారతదేశ విదేశాంగ శాఖ, దుబాయ్ ఎంబసి తో సంప్రదింపులు ముమ్మరం చేశారు. మృతదేహం తరలింపులో మోహనరావు కుటుంబానికి ఎటువంటి ఆర్థిక ఇబ్బంది లేకుండా అన్నీ తానై చూసుకున్నారు. ఈ నేపధ్యంలో దుబాయ్ నుండి డిల్లీ, డిల్లీ నుండి విశాఖ, బుధవారం నాడు విశాఖ నుండి దేవునల్తాడ వరకూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా మోహనరావు మృతదేహం చేరుకుంది. తమ కుటుంబ పెద్దదిక్కును కడసారిగా చూసుకుని.. తమ సంప్రదాయాల ప్రకారం అంతిమ కార్యక్రమాలను పూర్తి చేశారు. ఈ సందర్భంగా దేవునల్తాడ గ్రామస్తులు, మోహనరావు కుటుంబీకులు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు.








## 27న విద్యుత్ సరఫరాలో అంతరాయం



**మందస, ఫిబ్రవరి 25(వార్త):** హరిపురం, ఉద్దానం ప్రాంతాలలో ఈ నెల 27న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ సరఫరాలో అంతరాయం ఈఈ గుల్ల యజ్ఞేశ్వరరావు, జేఈ లఖినాన దినకర్ చెప్పారు. మందస మండలంలోని 33/11 హరిపురం సబ్ స్టేషన్ లో ఆర్డీఎస్ఎస్ విభాగంలో ఉద్దానం ఫీడర్ బైఫుర్కేషన్ వర్క్స్ లో భాగంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు హరిపురంటౌన్ లోని, పెద్దవీధి, కాపు వీధి, హెచ్చి కాలనీ, బీఎంపురం, రట్టి, బేతాళపురం, బహడపల్లి, నారాయణపురం, సువర్ణపురం, మగ్రిపాడు పరిసరి ప్రాంతాలకు విద్యుత్ నిలిపివేయబడుతుందన్నారు. విద్యుత్ శాఖ సిబ్బందికి వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

## పంపిణీకి సిద్ధంగా చెత్త సేకరణ వాహనాలు

**-స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా 12 మంజూరు**




**జలుమూరు, ఫిబ్రవరి 25(వార్త):** జలుమూరు మండలంలోని వివిధ పంచాయతీలకు చెత్త సేకరణ వాహనాలు చేరాయని, వీటిని త్వరలో పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో చిన్నమ్మడు తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మండలానికి ప్రభుత్వం మొత్తం 12 చెత్త సేకరణ వాహనాలు మంజూరు చేసిందన్నారు. స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు అవసరమైన పంచాయతీలకు వీటిని అందజేస్తామని వివరించారు. స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి చేతుల మీదుగా వాహనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో చెత్త నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యమని చెప్పారు.

## పాఠశాల అదనపు భవనం పూర్తయ్యేదెప్పుడో..!

**-శ్లాబ్ స్థాయిలోనే ఆగిన నిర్మాణం**

**-విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన**

**సారవకోట, ఫిబ్రవరి 25(వార్త):** కిడిమి ప్రభుత్వ పాఠశాల అదనపు భవనం ఎప్పుడు పూర్తవుతుందోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలగా ఉన్న సమయంలో గత ప్రభుత్వం సర్వశిక్ష అభియాన్ పథకం ద్వారా నిధులు మంజూరు చేసి అదనపు భవన నిర్మాణ పనులు ప్రారంభించింది. అయితే పనులు స్లాబ్ స్థాయి వరకు పూర్తి చేసి అక్కడే నిలిచిపోయాయి. ఏళ్లుగా నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో విద్యార్థులు తగిన తరగతి గదుల లేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో మరింత సమస్యలు ఎదురవుతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## అనుమానాస్పద స్థితిలో మత్స్యకారుడి మృతి

**- కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలాకి పోలీసులు**

**పోలాకి, ఫిబ్రవరి 25(వార్త):** పోలాకి మండలం రాజారాంపురంలో మత్స్యకారుడు మైలపల్లి ఎర్రయ్య (40) అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందినట్లు ఎస్ఐ రంజిత్ తెలిపారు. ఎర్రయ్యకు మద్యం అలవాటు ఎక్కువగా ఉండడంతో భార్యతో తరచూ గొడవలు జరుగుతుండేవని స్థానికులు చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం కూడా దంపతుల మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. అనంతరం అనుమానాస్పదంగా ఆయన మృతి చెందినట్లు గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు తెలిపారు.



## వాజీ..వాజీ..వాజీ..వచ్చావా..శివాజీ..!



**మాజీ మంత్రి గౌతు రాకతో నారాయణ కుటుంబంలో జోష్**

**సోంపేట, ఫిబ్రవరి 25(వార్త):** మాజీ మంత్రి గౌతు శ్యామ్ సుందర శివాజీ బుధవారం పట్టణ శ్రీశయన సంక్షేమ సంఘం అధ్యక్షుడు రెళ్ల నారాయణరావు ఇంటికి అతిథిగా హాజరయ్యారు. దీంతో ఆ కుటుంబం ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. కొద్ది రోజుల క్రితం నారాయణరావు సోదరుని గృహప్రవేశానికి శివాజీ ని ఆహ్వానించారు. అవకాశం లేక శివాజీ బుధవారం రావడం తో వారంతా ఎంతో సంబరపడ్డారు. పట్టణంలో నారాయణ రావు క్రియశీల నాయకుడు కావడంతో శివాజీ హాజరై కుటుంబ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలోపట్టణ టీడీపీ అధ్యక్షులు చిత్రాడ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణాపురంలో అగ్ని ప్రమాదం

**- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మూడు పూరిళ్లు దగ్ధం**

**జలుమూరు, ఫిబ్రవరి 25(వార్త):** అందవరం పంచాయతీ రామకృష్ణాపురంలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు పూరి గుడిసెలు పూర్తిగా దగ్ధమయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం సంభవించినట్లు సమాచారం. ఈ ఘటనలో నిరుపేదలు వాడన శాంతమ్మ, భోగమ్మ, మారెళ్ళ లచ్చుమ్మలకు చెందిన గుడిసెలు పూర్తిగా కాలిపోయాయి.

ఇళ్లలో ఉన్న సామాన్లు, దుస్తులు, అవసరమైన వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. బాధితులు కన్నీరుమున్నీరవుతూ తమ దుస్థితిని వివరించారు. మంగళవారం రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించి నష్ట వివరాలు సేకరించారు. బాధితులకు తగిన నష్టపరిహారం అందేలా ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు అధికారులు తెలిపారు.



## స్వర్ణ పంచాయతీలుగా తీర్చిదిద్దండి



**నరసన్నపేట, ఫిబ్రవరి 25(వార్త):** పంచాయతీ రాజ్ శాఖ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీలను స్వర్ణ పంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు సమగ్ర చర్యలు తీసుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో ఏ. రమేశ్ సూచించారు. బుధవారం నరసన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీల్లో 'చెత్త నుంచి సంపద' కేంద్రాలను బలోపేతం చేసి, పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ఆదేశించారు. ఈ కేంద్రాల ద్వారా ఆదాయాన్ని పెంచుకుని గ్రామాల అభివృద్ధికి వినియోగించుకునే అవకాశముందని తెలిపారు. పంచాయతీలు స్వచ్ఛత, పారిశుధ్యం, ఆదాయ వనరుల పెంపు వంటి అంశాలపై దృష్టి సారించాలని సూచించారు.

## ట్రాక్టర్‌కు ట్రక్ మంజూరు చేయాలి

**సారవకోట, ఫిబ్రవరి 25(వార్త):** అలుదు పంచాయతీలో చెత్త సేకరణకు మంజూరు చేసిన ట్రాక్టర్ ఇంజిన్‌ను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాలంటే ట్రక్ (ట్రైలర్)ను కూడా మంజూరు చేయాలని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చల్ల ఆనందరావు డిమాండ్ చేశారు. సుమారు రెండేళ్ల క్రితం ఈ పంచాయతీకి ట్రాక్టర్ ఇంజిన్ అందజేసినా, ట్రక్ ఇవ్వకపోవడంతో చెత్త సేకరణ వ్యవస్థ సక్రమంగా సాగడం లేదని ఆరోపించారు. ఫలితంగా గ్రామంలో పారిశుధ్య సమస్యలు నెలకొంటున్నాయని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ట్రక్ మంజూరు చేసి గ్రామంలో చెత్త తరలింపును పూర్తి స్థాయిలో అమలు చేయాలని బుధవారం కోరారు.



## హిందీ ప్రతిభ పరీక్షలో ఉత్తమ ప్రతిభ

**- సత్యవరం జెడ్పీ పాఠశాల విద్యార్థులకు 14 పతకాలు**



**నరసన్నపేట, ఫిబ్రవరి 25(వార్త):** నరసన్నపేట మండలం సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు హిందీ ప్రతిభా పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. జనవరి 25న నిర్వహించిన రాష్ట్రస్థాయి హిందీ టాలెంట్ టెస్ట్‌లో సత్యవరం పాఠశాలకు చెందిన 14 మంది విద్యార్థులు పతకాలు సాధించి పాఠశాలకు కీర్తి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రత్నమాల విద్యార్థులను అభినందించారు. హిందీ ఉపాధ్యాయులు ప్రసన్నలక్ష్మీ, భవాని విద్యార్థుల విజయానికి కారణమని కొనియాడారు. విద్యార్థులు భవిష్యత్తులో కూడా ఇలాగే కృషి చేసి మరిన్ని విజయాలు సాధించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

## 1న జలుమూరు మండల సమావేశం

**జలుమూరు, ఫిబ్రవరి 25(వార్త):** జలుమూరు మండల సర్వసభ్య సమావేశం మార్చి 1వ తేదీ ఆదివారం ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చిన్న మూడు తెలిపారు. మండల అధ్యక్షుడు వాన గోపి అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యుడు బగ్గు రమణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొంటారని వెల్లడించారు. మండల పరిధిలోని వివిధ అభివృద్ధి అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. జడ్పిటిసి మెండ విజయశాంతి రాంబాబు మాట్లాడుతూ సంబంధిత అధికారులు, సభ్యులు తప్పనిసరిగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని సూచించారు. మండల అభివృద్ధికి సంబంధించిన ముఖ్య విషయాలు ఈ సమావేశంలో ప్రస్తావనకు రానున్నాయని తెలిపారు.




## హరికృష్ణంపేట పాఠశాలను సందర్శించిన క్లస్టర్ చైర్మన్ నిర్మలాదేవి

**జలుమూరు, ఫిబ్రవరి 25(వార్త):** హరికృష్ణం పేట ప్రాథమిక పాఠశాలను క్లస్టర్ చైర్మన్ నిర్మలాదేవి బుధవారం సందర్శించారు. పాఠశాలకు చేరుకున్న ఆమె విద్యార్థులకు అందుతున్న బోధన విధానాలు, విద్యా ప్రమాణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులలో మరింత సామర్థ్యాలు పెంపొందేలా కృషి చేయాలని ప్రధానోపాధ్యాయుడు బాబురావు కు సూచించారు. అలాగే 'మన ఊరి బడిని కాపాడుకుందాం' కార్యక్రమాన్ని నిర్వహించి, వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అందరూ సహకరించాలని ఆమె కోరారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచిత వైద్యం

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 25 (వార్త):**నగరంలో డయేరియా లక్షణాలతో బాధపడుతున్న వారికి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ అనుమతి ఉన్న అన్ని హాస్పిటల్స్‌లలో ఉచిత వైద్యం అందించబడుతుందని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ అవని బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. శ్రీకాకుళం పట్టణంలో ఎవరికైనా డయేరియా లక్షణాలు ఉన్నట్టు అనిపిస్తే తక్షణమే నెట్వర్క్ హాస్పిటల్ కు వెళ్లి ఉచిత వైద్యం పొందాలన్నారు. వైద్యం కోసం ఎలాంటి సహాయం కావాలన్నా 9281068255, 9281068256, 9281068257, 9281068139 నంబర్లకు సంప్రదించాలన్నారు.

## పలాస డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ బదిలీ

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 25 (వార్త):** పలాస డిప్యూటీ కలెక్టర్ జి.వెంకటేష్‌తో పాటు కాశీబుగ్గ డీఎస్పీ షేక్ షాబాజ్ అహమ్మద్‌ను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 26 మంది డిప్యూటీ కలెక్టర్లు, 25 మంది డీఎస్పీలను బదిలీ అయింది. వీరికి  ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు.

మంత్రి నారాయణ పరామర్శ











### పిస్టల్ కేసులో.. పోలీసుల ఎదుట..

# చిరంజీవి లొంగుబాటు

* హైకోర్టులో బెయిల్ దక్కకపోవడంతో అనివార్యం * ఎచ్చెర్ల మండల రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఆయుధాల కొనుగోలు కుట్ర

**శ్రీకాకుళం క్రైమ్, ఫిబ్రవరి 25(వార్త):** జిల్లాలో రాజకీయంగా పెను సంచలనం సృష్టించిన పిస్టల్ కొనుగోలు కేసులో ప్రధాన నిందితుడు, ఎచ్చెర్ల మండలం ఫరీద్‌పేటకు చెందిన మొదలవలస చిరంజీవి (63) ఎట్టకేలకు పోలీసులకు లొంగిపోయారు. కేసు నమోదైన నాటి నుంచి పరారీలో ఉన్న ఆయన, చట్టపరమైన రక్షణ కోసం చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో బుధవారం శ్రీకాకుళం రూరల్ పోలీసుల ఎదుట లొంగిపోయారు.



### బెయిల్ కోసం ప్రయత్నాలు విఫలం

కొంగరం ఎంపీటీసీ జరుగుల్ల శంకరరావును హతమార్చేందుకు పిస్టల్ కొనుగోలు చేసినట్లు చిరంజీవిపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అరెస్టు నుంచి తప్పించుకునేందుకు ఆయన ఇన్నాళ్లు అజ్ఞాతంలో ఉంటూనే, ముందస్తు బెయిల్ కోసం గౌరవ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, కేసు తీవ్రత దృష్ట్యా అక్కడ ఆయనకు ఉపశమనం లభించకపోవడంతో, చివరకు దిగివచ్చి పోలీసులకు లొంగిపోవాల్సి వచ్చింది.

### గతంలోనే పట్టుబడ్డ అనుచరులు

రాజకీయ కక్షల నేపథ్యంలో సుమారు రూ. 90,000 వెచ్చించి ఒడిశాలోని బరంపురం నుంచి పిస్టల్ తెప్పించిన ఈ వ్యవహారంలో.. ఇప్పటికే పంచిరెడ్డి కైలాష్, కలగ ఉమామహేశ్వరరావు, అలబన మణి సహా ఆయుధాన్ని రిపేర్ చేసి విక్రయించిన మరో ముగ్గురిని పోలీసులు గతంలోనే అరెస్ట్ చేశారు. వీరి విచారణలో అసలు సూత్రధారి చిరంజీవేనని తేలడంతో పోలీసులు ఆయన కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఈ కేసులో మరో నిందితుడు సత్తారు గోపి హత్యకి గురయ్యాడు.

కాగా, చిరంజీవి పంపిన పంచిరెడ్డి కైలాష్, కలగ ఉమామహేశ్వరరావు, అలబన మణిలు సత్తారు గోపితో కలిసి బరంపురం వెళ్లి 'సంతోష్' అనే వ్యక్తి వద్ద పిస్టల్ కొనుగోలు చేశారు. కొన్న పిస్టల్ సరిగ్గా పనిచేయకపోవడంతో రిపేర్ నిమిత్తం నారాయణవలసకు చెందిన ఊర్జాన ప్రశాంత్ కుమార్ కి ఇచ్చారు.  ప్రశాంత్ కుమార్ దానిని బాగు చేయించకుండా నరసన్నపేటకు చెందిన చిన్నాకు విక్రయించాడు. చిన్నా ఆ పిస్టల్‌ను బాగుచేసి, శ్రీకాకుళానికి చెందిన తాండస కార్తీక్ అనే వ్యక్తికి రూ. 17,000లకు విక్రయించగా, పోలీసులు దానిని స్వాధీనం చేసుకున్నారు.

### ముందే పట్టుబడ్డ ముఠా..

ఈ అక్రమ ఆయుధ రవాణాలో పాలుపంచుకున్న కైలాష్, ఉమామహేశ్వరరావు, మణి, ప్రశాంత్ కుమార్, చిన్నా, కార్తీక్ వంటి వారిని పోలీసులు గతంలోనే అరెస్ట్ చేశారు. అయితే, ఈ వ్యవహారమంతటికీ డబ్బు సమకూర్చి నడిపించిన ప్రధాన సూత్రధారి చిరంజీవి మాత్రం పరారీలో ఉంటూ హైకోర్టు బెయిల్ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. అక్కడ ఉపశమనం లభించకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పోలీసుల ఎదుట లొంగిపోయారు

### పోలీసుల అదుపులో నిందితుడు

లొంగిపోయిన చిరంజీవిని పోలీసులు అదుపులోకి తీసుకుని  కోర్టులో హాజరు పరిచారు. కోర్టు ఆయనకు రిమాండ్  విధించగా ప్రస్తుతం అంపోలు జైలుకు తరలించినట్లు సమాచారం. రాజకీయ ప్రయోజనాల కోసం మారణాయుధాల సంస్కృతిని ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని పోలీసులు స్పష్టం చేశారు.

# అవాస్తవాలు నమ్మవద్దు

* అదుపులోనే అతిసారం
* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 25(వార్త):**నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ప్రబలిన అతిసారంపై సామాజిక మాధ్యమాలు, ఇతర మార్గాల్లో వస్తున్న అవాస్తవాలను నమ్మవద్దని, ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు.  అతిసారం కారణంగా అధికారికంగా ఇప్పటివరకు ఒక్కరు మాత్రమే మృతి చెందినట్లు ధృవీకరించారు. మిగిలిన మరణాలకు గల ఇతర కారణాలను విశ్లేషిస్తున్నామని, పరిస్థితిని ప్రభుత్వం పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తోందని తెలిపారు. కలుషిత నీటిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సేకరించిన నీటి నమూనాల తుది నివేదికలు అందుబాటులోకి వస్తాయని, ఆ తర్వాత పూర్తి స్పష్టత వస్తుందని చెప్పారు.

### డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

శ్రీకాకుళం నగరంలోని డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే గొండు శంకర్ బుధవారం పర్యటించారు. బాధితుల ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న ప్రతి ఒక్క రోగి వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ క్లిష్ట సమయంలో ప్రజలు భయపడవద్దని, ప్రభుత్వం ప్రజల పక్షాన నిలబడి అవసరమైన ప్రతి సహాయం అందిస్తుందని హామీ ఇచ్చారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వైద్యుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.  ప్రతి వీధిలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, డ్రైనేజీ వ్యవస్థను శుభ్రపరచాలని, తాగునీటి సరఫరా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.









### పట్టుదల, అకుంఠిత దీక్ష

## విజయానికి సోపానం

* హెచ్ఎం శాంతి
* కోడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వార్షికోత్సవం

**పోలాకి, ఫిబ్రవరి 25(వార్త):** పోలాకి మండలం కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 10వ తరగతి విద్యార్థుల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు జి. శాంతి మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో, అకుంఠిత దీక్షతో చదువులో రాణించాలని సూచించారు. కృషి, క్రమశిక్షణతో ముందుకు సాగితేనే విజయం సాధ్యమవుతుందని అన్నారు. ఉన్నత విద్యలు అభ్యసించేందుకు కళాశాలల్లో చేరే విద్యార్థులందరూ క్రమశిక్షణ పాటిస్తూ లక్ష్య సాధనలో ముందుండాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హాజరై విద్యార్థులను అభినందించారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546